# గోల్కొండ ఏరియా ఆస్పత్రికి మహర్దశ

కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్


వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కౌసర్, డాక్టర్ అజయ్‌కుమార్ తదితరులు

**గోల్కొండ:** గోల్కొండ ఏరియా ఆస్పత్రిని మరిన్ని హంగులతో కార్పొరేట్ ఆస్పత్రిగా మార్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్‌తో కలిసి గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో పర్యటించారు. రాష్ట్ర అసెంబ్లీలో తాను గోల్కొండ ఏరియా ఆస్పత్రి అభివృద్ధి, సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం జరిగిందన్నారు. దీనికి స్పందించిన రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు గోల్కొండ ఏరియా ఆస్పత్రికి అదనపు బ్లాక్ నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేశారన్నారు. ఇప్పటికే ఆస్పత్రిలో 10 పడకల ఐసీయూ బ్లాక్ ప్రముఖ కంపెనీల సహకారంతో ఆస్పత్రికి కొత్త ఆక్సిజన్ ప్లాంట్ ఉందని ఆయన అన్నారు. అనంతరం డాక్టర్ అజయ్‌కుమార్‌తో కలిసి ఆయన ఆస్పత్రిలోని వివిధ విభాగాలను తనిఖీ చేశారు. ఆస్పత్రి ఔట్ పేషెంట్ బ్లాక్‌ను పరీక్షించిన అజయ్‌కుమార్ ఓపీ విభాగాన్ని మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఇన్‌పేషెంట్ విభాగంలో డాక్టర్ అజయ్‌కుమార్ అక్కడి పేషెంట్లకు అందుతున్న అవసరాలు, ఇతర సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా ఆయనకు ఆస్పత్రిలో జరుగుతున్న శస్త్ర చికిత్సలు, ఇన్‌పేషెంట్లకు అందుతున్న సేవలను వివరించారు. ఆపరేషన్ థియేటర్‌ను అభివృద్ధి చేసి శస్త్ర చికిత్సలను చేస్తున్నామని ఆయన వివరించారు. ఔట్ పేషెంట్ విభాగంలో మహిళలకు, వృద్ధులకు విడివిడిగా కౌంటర్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ ఖాజా, మహ్మద్ రవూఫ్ ఉద్దీన్, డాక్టర్ ఎం. గోపాల్‌తో పాటు మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

### రోగుల భోజనంలో నాణ్యత పాటించాలి..

ఆస్పత్రుల్లో రోగులకు అందజేస్తున్న భోజనంలో నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను తప్పకుండా పాటించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ అన్నారు. గురువారం ఆయన గోల్కొండ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రి రోగులకు అందజేస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అంతేకాకుండా ఆస్పత్రిలో అమలవుతున్న రూ.5 భోజన పథకాన్ని కూడా ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. మజ్లిస్ నాయకులు బద్రుద్దీన్, హారూన్ ఫరాన్, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, అజీజ్‌ఖాన్ పఠాన్ తదితరులున్నారు.

## క్లుప్తంగా

### విశ్వసనీయతకు మారు పేరు.. మజ్లిస్ పార్టీ



**చార్మినార్:** మజ్లిస్ పార్టీ విశ్వసనీయతకు మారు పేరని.. ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం పని చేసిన తన సేవలను పార్టీ అధిష్టానం గుర్తించి తనకు ఎమ్మెల్సీ టికెట్ కేటాయించిందని స్థానిక సంస్థాగత ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేసిన మీర్జా రెహమత్ బేగ్ అన్నారు. ఎమ్మెల్సీ టికెట్ దక్కడం పట్ల పాతబస్తీ దూద్‌బౌలీకి చెందిన మజ్లిస్ పార్టీ నాయకులు రాజేశ్వర్ వర్మ, దీపేష్ రాజ్ వర్మ తదితరులు ఆయనను గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మీర్జా రెహమత్ బేగ్ మాట్లాడుతూ.. తనకు పార్టీ టికెట్ ఇవ్వడం పట్ల ధన్యవాదాలు తెలిపారు.

### అందుబాటులోకి నూతన బస్సు

**అఫ్జల్‌గంజ్:** ఉస్మానియా నర్సింగ్ విద్యార్థుల సౌకర్యార్థం వైద్యాధికారులు మంజూరు చేసిన నూతన బస్సు అందుబాటులోకి వచ్చింది. ఈ మేరకు గురువారం కొత్త బస్సును ఆస్పత్రి అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రితో కలసి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ పూజలు నిర్వహించిన అనంతరం జెండా ఊపి ప్రారంభించారు. గతంలో నర్సింగ్ వైద్య విద్యార్థుల ఉపయోగించిన మినీ బస్సు కాల పరిమితి ముగియడంతో ఆ బస్సు తరచూ రోడ్లపై మొరాయిస్తుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. నర్సింగ్ విద్యార్థుల అభ్యర్థన మేరకు డాక్టర్ నాగేందర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నూతన బస్సును మంజూరు చేయించారు. దీంతో అందుబాటులోకి వచ్చిన బస్సును వారు ప్రారంభించారు.

### ఇంద్రజాలం గొప్ప కళ


ఇంద్రజాలికులతో బుర్రా వెంకటేశం తదితరులు

**గన్‌ఫౌండ్రీ:** ఇంద్రజాల ప్రదర్శన గొప్ప కళ అని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. ఈ మేరకు గురువారం నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో తెలుగు విశ్వవిద్యాలయం, మెజీషియన్ల సంయుక్త ఆధ్వర్యంలో మెజీషియన్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంద్రజాలికులు తమ అద్భుతమైన నైపుణ్యంతో ప్రజలను ఎంతో ఆశ్చర్యచకితులను చేస్తారని కొనియాడారు. తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కిషన్‌రావు మాట్లాడుతూ.. సీనియర్ తెలంగాణ కళాకారులను గుర్తించి వారి సలహాలు, సూచనలను జూనియర్ విద్యార్థులకు వివరిస్తామని తెలిపారు. అనంతరం ఇంద్రజాలికులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెజీషియన్స్ అకాడమీ వ్యవస్థాపకులు సామల వేణు ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### భాగ్యలక్ష్మీ అమ్మవారికి ప్రముఖుల పూజలు


చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకుంటున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ

**చార్మినార్:** చార్మినార్ నియోజకవర్గం బీజేపీ సీనియర్ నాయకులు టి.ఉమామహేంద్రతో కలిసి కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషీ గురువారం చార్మినార్ భాగ్యలక్ష్మీ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ సినీ నటుడు రాజేంద్రప్రసాద్ కూడా భాగ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ ప్రతినిధులు వారికి ఆలయ మర్యాదలతో వేర్వేరుగా స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.

### జోరుగా కాంగ్రెస్ జోడో యాత్ర


యాత్రలో మెట్టు సాయికుమార్ తదితరులు

**అబిడ్స్:** గోషామహల్ నియోజకవర్గంలోని దత్తాత్రేయనగర్‌లో గురువారం కాంగ్రెస్ జోడో యాత్ర నిర్వహించారు. స్టేట్ కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు.

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలభాస్కర్, ఏసీపీ శంకర్ రాజు తదితరులు

**చార్మినార్:** ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ శంకర్ రాజు అన్నారు. గురువారం చార్మినార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిటీ కాలేజీలో విద్యార్థులకు, సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మైనర్ల డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్, స్టాప్ లైన్, జీబ్రా క్రాసింగ్, ట్రిబుల్ రైడింగ్, సిగ్నల్ జంపింగ్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే తమను తాము రక్షించుకోవడమే కాకుండా ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలభాస్కర్, కార్యక్రమం నిర్వహణాధికారి డాక్టర్ జయ కాగడా తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత మెగా వైద్య శిబిరం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఆశీష్‌కుమార్ యాదవ్

**అబిడ్స్:** గోషామహల్ నియోజకవర్గంలో ఈనెల 25న బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ ప్రారంభించే ఆశీష్‌కుమార్ ఆయుష్ కేంద్ర ఉచిత మెగా వైద్య ఆరోగ్య శిబిరం పోస్టర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ గురువారం ఆవిష్కరించారు. నియోజకవర్గం నలుమూలలా ఈ ఆయుష్ కేంద్ర ఉచిత వైద్య మెగా శిబిరాలు నిరంతరం నిర్వహిస్తామని ఆశీష్‌కుమార్ యాదవ్ తెలిపారు. అన్నివర్గాల ప్రజలకు ఈ శిబిరాలు దోహదపడుతాయన్నారు.

### అలరించిన శాస్త్రీయ సంగీతం

**గన్‌ఫౌండ్రీ:** కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో డాక్టర్ వుప్ప వెంకటరామశాస్త్రిచే సంగీతానందలహరి పేరిట గురువారం రవీంద్రభారతిలో నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది. హిమగిరి తనయే, శ్రీసరస్వతి వంటి పలు అంశాలపై చేసిన కచేరి సమ్మోహనపరిచింది. ఈ కార్యక్రమంలో కిన్నెర అధ్యక్షుడు ఆర్.ప్రభాకర్‌రావు, కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.


కచేరిలో పాల్గొన్న వెంకటరామశాస్త్రి తదితరులు

# కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం


సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి పుష్పలీల తదితరులు

**దూద్‌బౌలి:** కేంద్ర ప్రభుత్వ హయాంలో దేశంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు పుష్పలీల అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి తోడు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. గురువారం పాతబస్తీ ఉర్దూఘర్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మండిపడ్డారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలన సాగిస్తూ.. వేల కోట్ల రూపాయలు వెనుకేసుకుంటున్నారన్నారు. ఈ అక్రమ డబ్బుతో రాబోయే ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారన్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో అటు కేంద్రంలో బీజేపీతో పాటు రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు తిరస్కరించి ఓడించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని అధికారంలోకి వస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాశమోని శ్యాంరావు ముదిరాజ్, దిలావర్ హుస్సేన్, ముజీబుల్లా షరీఫ్, అస్లం తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు


కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్‌ను సన్మానిస్తున్న స్థానికులు

**దూద్‌బౌలి:** పురానాపూల్ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామని పురానాపూల్ డివిజన్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ అన్నారు. గురువారం జలమండలి డీజీఎం ఎం.ఎ.హకీం, ఏఈ భానుప్రసాద్ తదితరులతో కలసి పురానాపూల్ పార్థివాడలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైప్‌లైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ నాయకులు సుధాకర్, బాబు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఖదీర్‌ఖాన్ కుటుంబానికి పరిహారం చెల్లించాలి

**సాక్షి, సిటీబ్యూరో:** పోలీస్ లాకప్‌లో జరిగిన హింస వల్ల మెదక్‌వాసి ఖదీర్ ఖాన్ మృతిచెందడం దారుణమని జమాఅతె ఇస్లామీహింద్ తెలంగాణ అధ్యక్షుడు హామిద్ ముహమ్మద్ ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖదీర్ ఖాన్ కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, మృతుడి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని గురువారం డిమాండ్ చేశారు. పోలీసుల నిర్బంధంలో ఉన్న వ్యక్తి మరణించడం అమానవీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతిపై నిష్పక్షిక విచారణ జరిపి కారకులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ నాయకులు మాట్లాడుతూ... బుధవారం సంగారెడ్డి జైలు నుంచి 11 మంది ఖైదీలకు పూచీకత్తు చెల్లించి విడుదల చేయించారన్నారు. ఈ వివరాలను ఎంపీజే తెలంగాణ స్టేట్ సెక్రటరీ సలీమ్ హిందీ గురువారం మీడియాకు తెలిపారు.



### పాదచారిపై కత్తితో దాడి

**చాంద్రాయణగుట్ట:** ర్యాష్‌గా డ్రైవింగ్ ఎందుకు చేస్తున్నావని అడిగిన పాదచారిపై ద్విచక్ర వాహనదారుడు కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లికి చెందిన 16 ఏళ్ల మైనర్ బాలుడు ఫలక్‌నుమాలో బుధవారం రాత్రి మెడికల్ షాప్‌కు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ సమయంలో ఓ 17 ఏళ్ల యువకుడు బైక్‌ను ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ 16 ఏళ్ల బాలుడికి తగిలించాడు. చూసుకొని పోవచ్చు కదా అని ఆ బాలుడు అడగడంతో గొడవ మొదలయ్యింది. కోపంతో అక్కడి నుంచి వెళ్లిన యువకుడు తన స్నేహితుడు అలీ(18)ని తీసుకొచ్చి బాలుడిపై దాడి చేశాడు. తీవ్ర ఆగ్రహానికి గురైన అలీ కత్తితో బాలుడి కడుపులో పొడిచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు బాధితుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### పుస్తకావిష్కరణ



**గన్‌ఫౌండ్రీ:** నేటి వరకు విస్మరణకు గురైన సాహిత్యాన్ని వెలికితీసేందుకు తెలంగాణ సాహిత్య అకాడమీ కృషి చేస్తుందని అకాడమీ చైర్మన్ జూలురు గౌరీశంకర్ అన్నారు. గురువారం రవీంద్రభారతిలోని రచయిత శివశంకర్ రచించిన విషసురుడు పుస్తకావిష్కరణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సమాజాన్ని విభజించే సాహిత్యం కాకుండా ఐక్యతను చాటిచెప్పే సాహిత్యం రావాలని పిలుపునిచ్చారు. ఓయూ ప్రొఫెసర్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**అఫ్జల్‌గంజ్:** 11 కేవీ ఫైర్ స్టేషన్, పుత్లీబౌలీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. గురుద్వారా, రామ్ మందిర్, రాకేష్ పీటీ, అమృత్ బార్, పుత్లీబౌలీ చౌరస్తా, రామ్‌బాగ్ సమాజ్, రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం, బడేమియా పెట్రోల్ పంప్, సీబీఎస్, కన్నయ్య పాఠశాల తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

### ముగ్గురు పిల్లల సహా గృహిణి అదృశ్యం

**గౌలిపురా:** ముగ్గురు పిల్లలతో ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ గృహిణి కనిపించకుండా పోయిన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మొఘల్‌పురా బేలా చందులాల్ ప్రాంతానికి చెందిన శోభా (22)కు సంగమేశ్వర్‌తో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు దర్శన్ (13), దేవిక (8), నందిని (4)లు. శోభా సోదరుడు, ఆటో డ్రైవర్ కొవ్వ మద్యానికి బానిసై ప్రతిరోజూ ఇంట్లో గొడవ పడుతూ ఉండేవాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శోభ తన ముగ్గురు పిల్లలతో కలిసి ఈనెల 19న మధ్యాహ్నం 3 గంటలకు ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లింది. అనంతరం తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో తన సోదరి కనిపించడం లేదని గురువారం కళ్లప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# వీధికుక్కల నియంత్రణలో అధికారులు విఫలం



**గన్‌ఫౌండ్రీ:** జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ డి.సుధాకర్ అన్నారు. నాలుగేళ్ల బాలుడిపై వీధికుక్కల దాడి ఘటనపై సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీధికుక్కల బెడద నియంత్రణలో జీహెచ్‌ఎంసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. వీధికుక్కల దాడిలో మృతి చెందిన చిన్నారి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వీధికుక్కల నియంత్రణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రాముగౌడ్ రాకేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# మాతృభాషను పరిరక్షించుకోవాలి

**గన్‌ఫౌండ్రీ:** మాతృభాషను పరిరక్షించుకోవాలని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, ఆర్ఆర్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాతపస్వి కె.విశ్వనాథ్, గాయని వాణి జయరామ్‌లకు అంకితమిస్తూ తెలుగు సినీ సుస్వరాలు నాట్య విన్యాసాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భాషా పండితులను ఘనంగా సన్మానించారు. అంతకుముందు గాయనీ గాయకుల గీతాలాపన, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ శాఖ చైర్మన్ దామోదర్‌గుప్తా, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, తిరుమల బ్యాంక్ చైర్మన్ చంద్రశేఖర్, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ భీమ్‌రెడ్డి, కార్యదర్శి ఆమని తదితరులు పాల్గొన్నారు.


అవార్డు గ్రహీతలతో హోంమంత్రి మహమూద్ అలీ

# గోల్కొండలో..సందడిగా



గోల్కొండ కోటకు పర్యాటకులు గురువారం పోటెత్తారు. ఉదయం 10 గంటలకే కోట బుకింగ్ కౌంటర్ వద్ద పర్యాటకులు బారులుతీరారు. మరోవైపు గోల్కొండ కోటకు వచ్చిన వాహనాలతో రాందేవ్‌గూడ రోడ్డు వాహనాలతో నిండిపోయింది. కోటలో ప్రవేశించగానే ప్రధాన ద్వారం వద్ద గోల్కొండ హిస్టరీ గైడ్స్ పర్యాటకులకు ప్రధాన ద్వారం వద్ద ఉన్న క్లాపింగ్ పోర్టికో వివరాలను వివరించారు. అనంతరం కోటపై కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని పర్యాటకులు అక్కడే సేదతీరారు. - గోల్కొండ

### బద్దం బాల్‌రెడ్డికి ఘన నివాళి



**గోల్కొండ:** బీజేపీని బలీయమైన శక్తిగా తీర్చిదిద్దిన నాయకుల్లో దివంగత మాజీ ఎమ్మెల్యే బద్దం బాల్‌రెడ్డి ఒకరని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. గురువారం గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద బద్దం బాల్‌రెడ్డి 4వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు బద్దం బాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. నగర ప్రజల ఆదరణను చూరగొన్న అజాత శత్రువు బాల్‌రెడ్డి అని ఆయన అన్నారు. నాయకులు దేవర వంశీ, అశోక్‌యాదవ్, నామ యాదగిరి, రాధాకృష్ణయాదవ్, అశోక్, అశ్విన్ మోదీ, రక్షిత్ సాగర్, ప్రభు పూజారి పాల్గొన్నారు.

### మానవ హక్కుల కోసం విస్తృత సేవలు చేస్తా


ఎస్‌వీ. కోటేశ్వర్‌రావు

**గన్‌ఫౌండ్రీ:** హ్యూమన్స్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎస్‌వీ. కోటేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు షేక్ హాజీ షేర్‌ఖాన్ ఆయనకు గురువారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రాలలో తాను చేసిన సేవలను గుర్తించి బాధ్యతలను అప్పగించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత బాధ్యతాయుతంగా పనిచేసి మానవ హక్కుల కోసం విస్తృత సేవలు చేస్తానని తెలిపారు.

# నిరుద్యోగులకు అండగా పోలీస్ శాఖ

సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే


వివరాలు వెల్లడిస్తున్న సౌత్‌వెస్ట్ డీసీపీ కిరణ్ ఖరే, చిత్రంలో ఏసీపీ సతీష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రవి

**అబిడ్స్:** నిరుద్యోగులకు అండగా పోలీస్‌శాఖ విశేష కృషి చేస్తుందని సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే పేర్కొన్నారు. గురువారం మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో గోషామహల్ ఏసీపీ సతీష్‌కుమార్, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ రవితో కలసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన పలు వివరాలు వెల్లడించారు. నిరుద్యోగ సమస్య నిర్మూలనకు ఈ నెల 25న ఆసీఫ్‌నగర్ కింగ్స్ ప్యాలెస్‌లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 25 పేరుగాంచిన కంపెనీలు పాలుపంచుకుంటాయన్నారు. ఎస్ఎస్సీ పాస్ అయినవారితో పాటు అన్ని కోర్సులు చదివిన వారికి ఈ జాబ్ మేళాలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. జోన్ పరిధిలోని మంగళ్‌హాట్, ఆసీఫ్‌నగర్, టప్పాచబుత్ర, లంగర్‌హౌస్, కుల్సుంపురా లాంటి పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో మురికివాడలు, బస్తీల వారికి ఈ మెగా జాబ్ మేళా దోహదపడుతుందన్నారు. మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిల్లోన్ని ధూల్‌పేట పరిసర ప్రాంతాల్లో పూర్తిగా గంజాయి, సట్టా నివారించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో మంచి ప్రవర్తనతో ఉండేవారిని ప్రోత్సహిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

**సీసీ కెమెరాలపై ప్రత్యేక దృష్టి..**

సీసీ కెమెరాల పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టామని డీసీపీ కిరణ్ ఖరే పేర్కొన్నారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో చాలా వరకు సీసీ కెమెరాలు పనిచేయడం లేదని ఆయన వివరించారు. వెంటనే సీసీ కెమెరాలన్నీ పనిచేసే విధంగా సంబంధిత ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. దాంతో పాటు వ్యాపారస్తులు, ప్రైవేటు వ్యక్తులు తమ తమ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రత్యేకంగా కృషి చేస్తామన్నారు.

**ప్రతిరోజూ పర్యటిస్తా..**

అన్ని పోలీస్‌స్టేషన్ల ప్రాంతాల్లో ప్రతిరోజూ పర్యటిస్తానని డీసీపీ కిరణ్ ఖరే తెలిపారు. ప్రజలకు మెరుగైన పోలీసు పాలన అందించేందుకు పోలీస్‌స్టేషన్ల వారీగా పర్యటించి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా పోలీస్‌స్టేషన్లలో లేదా తనకు ఫిర్యాదు చేయాలని డీసీపీ సూచించారు.